టపాసులతో.. జాగ్రత్త



సత్తుపల్లిటౌన్: దీపావళి పర్వదినాన్ని ఇంటింటా జరుపుకునేందుకు సత్తుపల్లిలో ప్రజలు సోమవారం సిద్ధమయ్యారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఎంతో ఇష్టంగా దీపావళికి తారాజువ్వలు, చిచ్చుబుడ్లు, భూ చక్రాల వెలుగులతో సంతోషంగా జరుపుకునే ఈ పండుగలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన జీవితమే చీకటి అవుతుంది. కావున తగు జాగ్రత్తలు పాటిస్తూ వేడుకలను జరుపుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారులు, వైద్యులు పేర్కొన్నారు. ఏదైనా ఊహించని సంఘటన జరిగితే ఫైర్ సేవలకు 101, వైద్యసేవలకు 108, పోలీసులకు 100కు సమాచారం అందించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- బాణసంచా కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు ధరించడంతో పాటు కాళ్లకు పాదరక్షలు వేసుకోవాలి.
- విద్యుత్‌తీగలు, గడ్డివాములు, గుడిసెలు, పెట్రోల్ బంకులు ఉన్న చోట కాల్చరాదు.
- గ్యాస్ సిలిండర్లు, ఆయిల్ క్యాన్లు తదితర మండే పదార్థాలకు దూరంగా ఉండాలి.
- టపాసులు కాల్చేటప్పుడు పిల్లలను పరిశీలించాలి.
- పొడవాటి క్యాండిల్స్, అగరొత్తులు వాడి బాణసంచా కాల్చాలి. ఆ సమయంలో కళ్లకు గాగుల్స్ ధరించటం మంచిది.
- బహిరంగ ప్రదేశాలు, ఆరుబయట మాత్రమే టపాసులు పేల్చాలి.
- కాకరపూవత్తులు కాల్చిన తర్వాత వాటి కడ్డీలు చల్లారే వరకు ఒక చోటపెట్టి తీసివేయాలి.
- ఒకసారి అంటించిన తర్వాత వెలగలేదని చూసేందుకు వెంటనే దగ్గరకు వెళ్లవద్దు. కొన్నిసార్లు పేలే ప్రమాదం ఉంటుంది.
- ఎవరైనా ప్రమాదాలకు గురైతే వెంటనే ఆస్పత్రికి తరలించాలి.

కొనుగోళ్ల సందడి..



సత్తుపల్లిలో టపాసులు కొంటున్న ప్రజలు



కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో వెలిసిన టపాసుల దుకాణాలు

సత్తుపల్లి/కారేపల్లి: దీపావళి పండు సందర్భంగా సత్తుపల్లిలో, కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేశారు. పిల్లల నుంచి పెద్దల వరకు షాపుల వద్ద టపాసులు, చిచ్చుబడ్లు, క్రాకర్స్, తారాజువ్వలు తదితరల బాంబులు కొనేందుకు ప్రజలు ఎగబడ్డారు. దీంతో దుకాణాల వద్ద సందడి మొదలైంది. సాయంత్రం ఓ మోస్తారుగా వానజల్లు కురియడంతో.. స్టాల్స్ యజమానులు కాస్తంత ఆందోళనకు గురయ్యారు. వర్షం ఉంటే అమ్మకాలు తగ్గుతాయని, దీంతో నష్టం వాటిల్లుతుందని తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

జాగ్రత్తలు పాటించాలి..



బాణసంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలి. భారీ బాణసంచా కాల్చటం వల్ల వచ్చే పొగతో శ్వాసకోశ సమస్యలు, వినికిడి ఇబ్బందులు వస్తాయి. ఏమైనా ప్రమాదం జరిగితే వైద్యుడిని సంప్రదించాలి.

– కట్టా శివాజీ, నేత్ర వైద్యులు, సత్తుపల్లి

క్లుప్తంగా

విద్యుత్ వెలుగులు



స్విచ్ ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని కొమ్మేపల్లి కాలనీ పక్కన గల కొత్త కాలనీలో ఐదు వీధులకు రూ.15 లక్షల మున్సిపాలిటీ నిధులతో ఏర్పాటు చేసి విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లను ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ, విద్యుత్‌శాఖ డీఈ రాములు, ఏఈ శరత్‌బాబు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి

బోనకల్: అకాల వర్షాలతో నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మాదినేని రమేష్ అన్నారు. ఆదివారం మండలంలోని రావినూతల, బోనకల్ గ్రామాల్లో దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో మధిర డివిజన్ రైతుసంఘం కార్యదర్శి నాగేశ్వరరావు, సురేష్, శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

12మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల ఎంపిక

చింతకాని: తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో నూతనంగా తీసుకొచ్చిన లైసెన్స్‌డ్ సర్వేయర్ నియామకాలకు సంబంధించి చింతకాని మండలానికి 12మంది సర్వేయర్లను ఎంపిక చేశారు. వారు హైదరాబాద్‌లోని శిల్పాకళావేదికలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆదివారం నియామక పత్రాలను అందుకున్నారు.

ఘనంగా జూబ్లీ శిలువ వేడుకలు



క్రీస్తు శిలువ వద్ద పూజలు చేస్తున్న క్రైస్తవులు

వైరా: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం జూబ్లీ 2025 శిలువ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ మాదాసు రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది అక్టోబర్ 22న ప్రపంచ వ్యాప్తంగా ప్రారంభమైన జూబ్లీ వేడుకలు ఈ నెల 22తో ముగుస్తాయన్నారు. ప్రతి దేవాలయంలో శిలువ వేడుకలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నతెరిసమ్మ, దళ సభ్యులు సంఘస్తులు పాల్గొన్నారు,

మహిళలు, మైనార్టీలకు భద్రత కరువు

సత్తుపల్లిరూరల్: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో మహిళలు, మైనార్టీలు, దళితులు, అట్టడుగు వర్గాలకు భద్రత కరువైందని ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి విమర్శించారు. సత్తుపల్లిలో ఆదివారం జరిగిన డివిజన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకులు జ్యోతి, నాగమణి, కుమారి, లలిత, ఝాన్సీ, సత్యావతి, ప్రభావతి, రైతు సంఘం నాయకులు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన వేల్పుల బాలాజీ, రాయల రాంబాబు ఇంటి సరిహద్దు విషయంలో ఆదివారం వివాదం జరిగింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో ఎస్సై కె.వీరేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా అయ్యప్ప పడిపూజ

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడులో శ్రీవిశ్వధర్మక్షేత్రంలో శనివారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పదునెట్టాంబడి పడిపూజను భక్తిశ్రద్ధలతో చేశారు. పడిపూజలో వందలాది మంది అయ్యప్ప మాలాధారణ భక్తులు పాల్గొన్నారు. సిద్ధాంతి వెల్లటూరి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పడిపూజలో గురుస్వాములు రామడుగు గురుప్రసాదాచార్యులు, బాలకృష్ణచారి, బల్లెం సీతారామాచారి, సురేంద్ర, వెల్లటూరి పవన్ పాల్గొన్నారు.

30న అయ్యప్ప ఆలయ దశమ వార్షికోత్సవం

సత్తుపల్లి: పట్టణంలోని జేవీఆర్ పార్కు ఎదురుగా గల శ్రీహరిహరాత్మజ అయ్యప్పస్వామి దేవాలయం సత్తుపల్లి దశమ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 30న నిర్వహించబడతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం వార్షికోత్సవ కరపత్రాలను మానస నాని, ఆలయ కమిటీ బాధ్యులు ఆవిష్కరించారు. టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు ఆధ్వర్యాన.. కేరళ తంత్రి మధుసూస్ నంబూద్రి, అర్చకులు వెంకట సురేష్‌లచే పడిపూజ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు శ్రీనివాసరావు, మల్లికార్జున శర్మ, శ్రీనివాసరావు, మధు, కోటేశ్వరరావు, సురేష్, శివ పాల్గొన్నారు.

మాలధారులకు అన్న ప్రసాద వితరణ

మధిర: మధిర పట్టణంలోని శ్రీస్వామి అయ్యప్ప అన్నదాన సేవాసమితి(ఆర్వీ స్వామి సిండికేట్) ఆధ్వర్యంలో మాలధారులకు ఆదివారం అన్న ప్రసాద వితరణ చేశారు. దాతల సాయంతో అయ్యప్ప, భవాని, శివ, తిరుపతమ్మ, గోవింద మాల ధారులకు స్థానిక సాయినాధుడి ఆలయంలోని ఫంక్షన్‌హాల్‌లో 41రోజుల పాటు అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. తొలిరోజు అన్నదానానికి దాత కర్నాటి వెంకటేశ్వరరావు సాయం అందించారు.

వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లి: కాకతీయ యూనివర్సిటీ వాలీబాల్ పోటీల్లో సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభచూపి ప్రథమ స్థానంలో నిలిచారని వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.గోపి తెలిపారు. విద్యార్థులను ప్రొఫెసర్, ప్రిన్సిపాల్‌తో పాటుగా.. పీడీ పూర్ణచందర్‌రావు, కోచ్‌లు నాగరాజు, సురేందర్ అభినందించారు.

కోటమైసమ్మతల్లికి ప్రత్యేక పూజలు

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో వెలిసిన శ్రీకోటమైసమ్మతల్లి ఆలయంలో భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాష శర్మ, ఆలయ సిబ్బంది మోహన్‌కృష్ణలు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

వైరా: వైరాలోని సీపీఎం కార్యాలయంలో ప్రతి నెలా 3వ ఆదివారం నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆదివారం డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు, డాక్టర్ జట్ల రంగారావుల నేతృత్వంలో దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్ వ్యాధి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. బోడేపూడి వైద్య శిబిరం వాలంటీర్లు రాంబాబు, చలపతిరావు, రజిత, సమత, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఉత్సవాలను జయప్రదం చేయండి

ఏన్కూరు: భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి నూరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. ఆదివారం ఏన్కూరులో అమరనేని వీరభద్రం అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజల మధ్య.. ప్రజల కోసం పని చేసే పార్టీ అన్నారు. పార్టీ వైరా నియోజకవర్గ కార్యదర్శి బాబు, నాయకులు పాల్గొన్నారు.

ఐద్వా జాతీయ మహాసభలను..

కొణిజర్ల: వచ్చే ఏడాది జనవరి 25నుంచి నిర్వహించనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా) జాతీయ మహాసభలను మహిళలు జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మేరుగు రమణ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తనికెళ్లలో సంఘం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశాల్లో చర్చించనున్నట్లు తెలిపారు.

డీఎస్పీగా ఎంపికైన హిమవర్షిణిరెడ్డికి సత్కారం

సత్తుపల్లిటౌన్: పట్టణానికి చెందిన గోలి శ్రీనివాసరెడ్డి, ఉష దంపతుల కుమార్తె గోలి హిమవర్షిణీరెడ్డి గ్రూప్–1 ఫలితాల్లో డీఎస్పీ ఉద్యోగం సాధించి సత్తుపల్లి వచ్చిన సందర్భంగా ఆదివారం కిట్టిపార్టీ మహిళలు ఘనంగా సత్కరించారు. జయ, ఇందు, శ్రీలత, ఉషా, సుజలరాణి పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

కల్లూరు: స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఫౌండేషన్ లబ్ధిదారులకు, వాలంటీర్లకు, నిరుపేదలకు దీపావళి కానుకగా చైర్మన్ ఉయ్యూరు శ్రీవ్యాల్, ప్రతినిధి వరకా రామారావుల ఆధ్వర్యంలో రూ.లక్ష విలువైన నిత్యావసర సరుకులను అందించారు. వాటిని భూపాలపల్లి డీపీఆర్‌ఓ శీలం శ్రీనివాస్, మహబూబాబాద్ ఉద్యాణశాఖ జిల్లా అధికారి జీనుగు మరియన్న చేతుల మీదుగా పంపిణీ చేశారు. తిరువూరు సీడీపీఓ కృష్ణకుమారి, దోసపాటి భాస్కర్‌రావు, చారు గుండ్ల మొరళి, ఉబ్బన నాగరాజు, ఉబ్బన బాబూరావు తదితరులు పాల్గొన్నారు.